క్లుప్తంగా

వెంచర్ల పరిశీలన



వెంచర్లను పరిశీలిస్తున్న ఎంపీఓ విఘ్నేశ్వర్

వెల్దుర్తి(తూప్రాన్): పేదోడి సొంతింటి కలపై రియల్ దందా అంటూ సాక్షి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. మౌలిక వసతులు పూర్తి చేయకున్నా.. తాకట్టు స్థలం రిలీజ్ చేసిన వెంచర్లను ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఎంపీఓ విఘ్నేశ్వర్ సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్కులో కొంత భాగం, డ్రైనేజీ పైపులైన్ ఉన్న ప్రాంతాన్ని ప్రైవేట్ వ్యక్తి ఆక్రమించారని ప్లాట్ల కొనుగోలుదారులు ఎంపీఓ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి ఫెన్సింగ్ తొలగించాలని ఈఓ బలరాంరెడ్డిని ఆదేశించారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించి, తదుపరి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీఓ తెలిపారు. అదేవిధంగా సాక్షికథనంపై ఇంటలిజెన్స్ పోలీసులు ఆరా తీశారు.

దుస్తుల పంపిణీ



దాత బహూకరించిన దుస్తులతో అంగన్‌వాడీ చిన్నారులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు గ్రామానికి చెందిన భాస్కర్‌చారి అనే యువకుడు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు. సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజహితం కోసం ఖర్చుచేయడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ టీచర్ లావణ్య ఉన్నారు.

చిత్రలేఖన పోటీలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని గీసి తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో అత్యధికంగా ఏడో తరగతి విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ చిత్రంగా లక్ష్మీప్రసన్న మొదటి బహుమతికి, ప్రణవ్ ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలోబహుమతులను అందించనున్నట్లు హెచ్ఎం లీలావతి తెలిపారు.

కబ్జా నుంచి చెరువు స్థలం కాపాడాలి



ముత్రాజ్‌పల్లి చెరువు అలుగు కబ్జా చేసి సాగుచేసిన వరిపంట

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి పెద్దచెరువు భూమి కబ్జానుంచి కాపాడాలని మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు, చెరువు ఆయకట్టు మాజీ చైర్మన్ సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పెద్ద చెరువు అలుగు కింద భూమికి గ్రామానికి చెందిన నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. గతంలో అలుగు కింద అలుగు నీరుపారేందుకు సుమారు ఎకరం భూమి ఉండేదని ప్రస్తుతం 20గుంటలకు పైగా భూమి కబ్జాలు చేసి, వరి పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. దీంతోపాటు చెరువులోని వచ్చే రోడ్డును సైతం ధ్వంసం చేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి చెరువు స్థలాన్ని కబ్జానుంచి కాపాడాలని కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న పురాతన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పాపన్నపేట ఇన్‌చార్జి ఎంపీడీఓగా విష్ణువర్ధన్

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఇన్‌చార్జి ఎంపీడీఓగా విష్ణువర్ధన్ నియామకమయ్యారు. వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న విష్ణువర్ధన్‌ను పాపన్నపేట ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి
- తూప్రాన్‌లో పోషణ మాసోత్సవాలు



పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ

తూప్రాన్: సమతుల పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివకుమారి పేర్కొన్నారు. బుధవారం పోషణ మాసోత్సవాలను ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్టు, తుప్రాన్ సెక్టార్ పరిధిలోని తూప్రాన్‌-6 అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ.. తల్లులందరికీ సరైన పోషకాహారం, సమతుల పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. అలాగే పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, పిల్లల పెరుగుదల కుంటూ పడితే, జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ దుర్గారెడ్డి, ఏఎన్ఎం రేణుక, వార్డ్ ఆఫీసర్ బాబురావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసంలో భాగంగా పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలపై, తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించడంతో పాటు చిన్నారుల బరువును కొలిచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, స్వరూప, ఏఎన్‌యం సునీత, జ్యోతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మెదక్‌లో..

మెదక్‌మున్సిపాలిటీ: పట్టణంలో పోషణ మాసోత్సవాలను ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్లంబేస్ అంగన్‌వాడీ సెంటర్‌లో చైల్డ్ మ్యారేజ్, వరకట్న వేధింపులు, గృహహింస, సఖి సేవలను వివరించారు.



తూప్రాన్: మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివకుమారి



శివ్వంపేట(నర్సాపూర్): అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ సంతోష

బాలికలకు ఆపద సమయంలో టోల్ ఫ్రీ నెంబర్లు 181, 1098, 100 లను ఉపయోగించుకోవాలన్నారు. మెంటల్ హెల్త్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ద్వారా మానసిక సమస్యలు ఉంటే 14416 టోల్ ఫ్రీకి కాల్ చేసి కౌన్సెలింగ్ సేవలు కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఐడీఎస్ అధికారి నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు స్మరణ, రేణుక, పోచమ్మ, మమత, లక్ష్మి, శివరాణి, కవిత పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): పోషణ మాసోత్సవంలో భాగంగా శివ్వంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామీణ పోషణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష మాట్లాడారు. అందరూ పౌష్టికాహారం తినాలని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీచర్ కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

పోషక మహోత్సవాలు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహోత్సవాలు నిర్వహించారు. పెద్దచింతకుంట, నర్సాపూర్‌లోని సునీతారెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపప్‌వైజర్లు సరళ, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, భూలక్ష్మి మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు సహించం

– బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడితే భౌతిక దాడులు తప్పవని బీఆర్ఎస్ నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలననో అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిపై లేనిపోని విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతు భరోసా రాలేదని, రుణమాఫీ కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సొంత గ్రామంలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఆవుల రాజిరెడ్డిని ప్రజలు తిరస్కరించినా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ బాబ్యానాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, శివ్వంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు భోగశేఖర్, నాయకులు సత్యంగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు భిక్షపతి, జీవన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్‌పై ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్

- ఆగ్రహించిన రైతులు బ్యాంకు ఎదుట ధర్నా
- బ్యాంకు మేనేజర్ నిలదీత



అల్లాదుర్గం ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో రైతులు వివరాలు తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్తుంటే ఫీల్డ్ ఆఫీసర్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో వివరాలు తెలియక అవస్థలు పడుతున్నారు. డ్వాక్రా గ్రూప్ మహిళలకు రుణాలు మంజూరైన బ్యాంకులో సరైన సమయంలో అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా బ్యాంకు చుట్టూ తిరిగిన పట్టించుకోనేవారు లేకపోవడంతో రైతులు, వినియోగదారులు, డ్వాక్రా మహిళలు ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా చేసి, మేనేజర్‌ను నిలదీశారు. ఈ సంఘటన బుధవారం అల్లాదుర్గంలో చోటుచేసుకుంది. ప్రభుత్వం ఇటీవల రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేసింది. అయితే రుణమాఫీ కానీ రైతులు ఎందుకు కాలేదో తెలుసుకునేందుకు బ్యాంకు చుట్టూ తిరుగుతున్న, ఫీల్డ్ ఆఫీసర్ లేకపోవడంతో వివరాలు తెలియక నానా అవస్థలు పడుతున్నారు. బ్యాంకులో ఉన్న సిబ్బందిని ప్రశ్నిస్తే.. తమకేమీ తెలియదని ఫీల్డ్ ఆఫీసర్‌ని అడగాలని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా మహిళలు రుణాల కోసం బ్యాంకుకు వస్తే సరైన సమయంలో రుణాలు అందక పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో ఆగ్రహించిన వీరు బ్యాంకు మేనేజర్‌ను నిలదీసి ధర్నా చేశారు.

హెల్త్ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆశ వర్కర్ల నిరసన



ప్రగతి ధర్మారం పీహెచ్‌సీ వద్ద డాక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

రామాయంపేట (మెదక్): హెల్త్ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఆశ వర్కర్లపై చేయి చేసుకొని దూషించిన హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆశ వర్కర్లు మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్ హరిప్రియకు వినతిపత్రం అందజేశారు.

హెల్త్ సూపర్‌వైజర్‌పై చర్యలు చేపట్టాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఆశ వర్కర్స్‌పై అసభ్యకరంగా ప్రవర్తించిన హెల్త్ సూపర్‌వైజర్ అనిల్ డేవిడ్‌పై చర్యలు చేపట్టాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు ఎదుట ఆశ వర్కర్స్ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అజయ్, టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు సమత, ఆశ వర్కర్స్ మండల అధ్యక్షురాలు దేవమ్మ, సలీమా పాల్గొన్నారు.

తూప్రాన్: ఆశలపై దురుసుగా ప్రవర్తించిన మెడికల్ సూపర్‌వైజర్ అనిల్ డేవిడ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశవర్కర్లపై దాడిచేసిన సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. కౌడిపల్లి పీహెచ్‌సీ ఎదుట మండల ఆశవర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ఆశవర్కర్ల సంఘం అధ్యక్షురాలు శ్యామల మాట్లాడారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు ఉద్యోగభద్రత కల్పించండి



మంత్రి దామోదరతో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

మంత్రి కిదామోదరకు వినతిపత్రం అందజేత

మెదక్ కలెక్టరేట్: ఆరోగ్యమిత్రలను ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేశ్, జిల్లా శాఖ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహకు వినతిపత్రం అందజేశారు. బుధవారం మెదక్ వచ్చిన మంత్రిని సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. 17 ఏళ్లుగా తాము నామమాత్రపు వేతనాలతో పని చేస్తున్నామని, తమను గుర్తించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మెదక్ నర్సాపూర్ ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్, సునీతారెడ్డికి కూడా వినతిపత్రం అందజేశారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం అందజేశారు. బుధవారం మంత్రి కౌడిపల్లి చెరువు వద్దకు రావడవంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు సత్యాగౌడ్, నరేందర్, రాజేశ్వరీ, మంజుల, వినోద, గేమ్‌సింగ్, పీఈటీ పానీల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో మంత్రికి ఘన స్వాగతం

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా సమీక్ష సమావేశానికి వెళ్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నర్సాపూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

మెదక్ కలెక్టరేట్: జూనియర్ లెక్చరర్ ఉద్యోగ పోస్టింగ్‌లు ఇస్తుండటంతో మా కుటుంబాలు రోడ్డున పడతాయని, తమను ఆదుకోవాలని జిల్లాలోని గెస్ట్ లెక్చరర్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌కు వచ్చిన ఆయను గెస్ట్ లెక్చరర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గెస్ట్ లెక్చరర్లు కృష్ణ, నాయిని శ్రీకాంత్, అరుణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు సాయిసౌమ్య అన్నారు. బుధవారం శివ్వంపేటలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వస్తున్నందున ప్రతీ విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ యాదగిరి, ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలచంద్రం, ఏఎన్ఎంలు రేణుక, సుజాత తదితరులు ఉన్నారు.

చెరువు బుంగ.. రైతులకు బెంగ



రుద్రారం పెద్ద చెరువు బుంగను పూడ్చేందుకు శ్రమిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం పెద్ద చెరువు బుంగను కట్టడి చేయడంలో ఇరిగేషన్ శాఖ సిబ్బంది విఫలమయ్యారని, దీంతో పంటలకు నీరు చేరి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజుల నుంచి చెరువు కట్టకు పడిన బుంగను అరికట్టలేదని, బుంగను కనిపెట్టడంలో ఇరిగేషన్ సిబ్బంది విఫలమైతున్నారని రైతులు తెలిపారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మణ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం చెరువు కట్ట వద్ద బుంగను పూడ్చే పనులను ఇరిగేషన్ సిబ్బంది చేపట్టారు.


సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సాయిబాబా

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ డీఎల్‌పీఓ సాయిబాబా హాజరై, మాట్లాడుతూ.. వనమహోత్సవాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు. వర్షాలు ఎక్కవగా పడుతున్నందున క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా కూలిన ఇంటి నివాసులకు, శిథిలావస్థలో ఉన్న ఇంటి నివాసులకు ఆవాసం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న చెక్‌డ్యాం



శివ్వంపేట(నర్సాపూర్): మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లో జలకళ సంతరించుకుంది. మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామ శివారులో ఉన్న పిల్లిగుళ్ల చెక్ డ్యాం నిండి మత్తడి దూకుతుంది.

చెరువుకు గండి..

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సిలింగాపూర్ పెద్ద చెరువుకు గండి పడింది. గ్రామస్తులు ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ రజనికుమారి, నీటి పారుదల శాఖ ఏఈ కుషాల్, ఎంపీడీవో సజీలుద్దీన్ చెరువు గండిని పరిశీలించి పూడ్చివేయించారు.



రామాయంపేట(మెదక్): గండిని పూడ్చివేస్తున్న ఇరిగేషన్ అధికారులు



వెల్దుర్తి(తూప్రాన్): ఖాన్ చెరువు బుంగ పూడ్చివేస్తున్న ఇరిగేషన్ అధికారులు, రైతులు

సంక్షిప్త వార్తలు

◆ ఫీవర్ సర్వే పరిశీలన



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లో వైద్యసిబ్బంది నిర్వహించే ఫీవర్ సర్వేను ఎంపీఓ కలీముల్లా బుధవారం పరిశీలించారు. మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదేశాలలో మహ్మద్‌నగర్ గ్రామంలో ఏఎన్ఎం మజీదాబేదం వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ ఇతర అనారోగ్యాలపై సర్వే నిర్వహించారు. సర్వేను ఎంపీఓ పరిశీలించి గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షాలతో చెరువులు నిండి అలుగులు పారుతున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడారు. యువత, చిన్నారులు చెరువుల దగ్గర జాగ్రత్తలు పాటించాలని కోరారు. సెల్ఫీలతో ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ ఉన్నారు.

◆ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నర్సాపూర్ డీఎల్‌పీఓ సాయిబాబా అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఫైజాబాద్ గ్రామాన్ని సందర్శించి, పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటి రికార్డులు అప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా వానకాలం సీజన్ సందర్భంగా సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో తప్పనిసరిగా డ్రైడే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

◆ సమాజ అభివృద్ధిలో గురువులు కీలకం



శివ్వంపేట(నర్సాపూర్): సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర కీలకమని లయన్స్‌క్లబ్ ఆఫ్ బాలనగర్ ఇలైట్ 320బీ జిల్లా గవర్నర్ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. మండలంలోని దొంతి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 80 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ సుబ్రహ్మణం, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. దొంతి గ్రామానికి చెందిన చిగుళ్లపల్లి కృష్ణ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి రూ. 11లక్షలు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు.

◆ కోతుల దాడిలో బాలికకు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): కోతుల దాడిలో బాలికకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్ కూతురు షారోన్ తోటి పిల్లలతో కలిసి ఆరుబయట ఆడుకుంటున్న తరుణంలో కోతుల మంద పిల్లలపై దాడి చేయడంతో బాలికకు పలుచోట్ల గాయాలయ్యాయి.

◆ కూలిన ఇళ్ల పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయిలో కూలిన ఇళ్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు, ప్రభాకర్, ప్రసన్నకుమార్, బాలమల్లయ్య ఉన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం, భారాహిమామ్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పట్టణ ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) జావేద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా స్తంభాల మార్పు, వైర్లు, మరమ్మతు పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని ఏఈ జావేద్ కోరారు.